క్లుప్తంగా

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి


పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


పింగళి వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న 'నన్నయ' ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

బిక్కవోలు: స్వాత్రంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు కొంకుదురు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ నాయకులు, దేశ భక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, వలీషా, లక్ష్మణరెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: జాతీయ పతాకం రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, చరిత్రశాఖల ఆధ్వర్యంలో పింగళి జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ సుధామయి, వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి


కుళాయి నీటిని పరిశీలిస్తున్న డీపీఓ రాంబాబు

రాజానగరం: చక్రద్వారబంధంలో పారిశుధ్యాన్ని తక్షణమే మెరుగుపర్చాలని కార్యదర్శికి జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న అధ్వాన పరిస్థితులపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు. పలు ప్రాంతాలలో తిరిగి పారిశుధ్యం, నీటి సరఫరా మున్నగు వాటిని పరిశీలించారు. పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు.

పశువులకు మేత అందించాలి

మధురపూడి: అధిక వర్షాలు, గోదావరి వరద నేపథ్యంలో పశుగ్రాసం కొరత ఏర్పడిందని, వెంటనే పశువులకు మేత అందించాలని ప్రభుత్వాన్ని శ్రీరంగపట్నం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అత్తిలి రాంప్రసాద్ కోరారు. సరైన మేత లేకపోవడంతో పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. పాడి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించాలని కోరారు.

8న బంగారు వరలక్ష్మి డ్రా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఈనెల 8వ తేదీన బంగారు వరలక్ష్మీ-2 లక్కీడ్రా నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ తెలిపారు. దీనిలో విజేతలకు ఒక గ్రాము బంగారం రూపు అందిస్తున్నామన్నారు. ఈ మేరకు మహిళలు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశాలు

సీతానగరం: రఘుదేవపురం పంచాయతీలో 2014-2019 మధ్య కాలంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఫిర్యాదుపై పంచాయతీరాజ్ కమిషనర్ స్పందించి, విచారణకు ఆదేశించారని చిన కొండేపూడికి చెందిన న్యాయవాది చిడిపి నకులసురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విచారణ నివేదికను పంచాయతీ రాజ్ కార్యాలయానికి పంపాలని కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశించారన్నారు.

సిబ్బందికి శిక్షణ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూశాఖలోని జూనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ ప్రారంభమైంది. పంటకోత అంచనా సర్వే, వ్యవసాయ గణనపై ఈ నెల 8 వరకూ శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా అర్థగణాంక అధికారి (సీపీవో) ఎల్.అప్పలకొండ మాట్లాడుతూ సర్వేపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో పదోన్నతుల్లో భాగంగా సర్వే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి అన్నారు.

ముందుచూపుతో ప్రగతి వెలుగులు

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ
- నియోజకవర్గంలో ఆరు సబ్ స్టేషన్ల ఏర్పాటు
- లో ఓల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం


వెలుగుబందలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

రాజానగరం: నేటి ఆధునిక సమాజంలో విద్యుత్ వెలుగులు కనిపించని గృహమంటూ ఏదీ ఉండదు. ఒకప్పుడు సంధ్యా సమయం అయ్యిందంటే చాలా మంది ఇళ్లలో కిరోసిన్ దీపాలు, నూనె దీపాలు వెలిగించేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు లేవు. అంతా విద్యుత్ వెలుగులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చివరకు పూరి గుడిసెల్లో కూడా విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ విధంగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో లోవోల్టేజ్ సమస్య తలెత్తడం సహజం. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు సాధారణంగా విద్యుత్ వాడకం అధికంగా ఉంటుంది. ఈ సమయంలో ఎదురయ్యే లోవోల్టేజ్ సమస్యతో గుడ్డి దీపాల్లా వెలుగుతున్న విద్యుత్ బల్బులు, నెమ్మదిగా తిరిగే ఫ్యాన్లు, వెలగనా మాననా అన్నట్టుగా ఉండే ట్యూబ్ లైట్లుతో ప్రజలు ముఖ్యంగా దిగువ తరగతి వారు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. వినియోగదార్ల సమస్యలు గ్రహించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో నాటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముందు చూపుతో వ్యవహరించి, రెండు, మూడు గ్రామాలకు ఒక విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండేలా అధికారులచేత ప్రతిపాదనలు పంపించి, వాటికి అనుమతులు, నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఫలితంగా నేడు గ్రామీణ ప్రాంతాలలో కూడా లోవోల్టేజీ సమస్య లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు.

ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు

నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో కొత్తగా ఆరుచోట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించారు. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని వేపాలదిబ్బ ప్రాంతంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ. 40.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వీటిలో ఒకటి. ఇదే అత్యధిక వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్. దీని ద్వారా రాజానగరం, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. గృహ అవసరాలతో పాటు పారిశ్రామిక ప్రగతికి తోడ్పడుతుంది. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటల పాటు అందించవచ్చు. అలాగే రాజానగరం మండలం వెలుగుబంద, రాధేయపాలేలలో రూ. 7.64 కోట్ల నిధులతో రెండు 33/11 కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

వీటిలో వెలుగుబందలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీలోని 11,300 గృహావసరాలతో పాటు ఆయా ప్రాంతాల ప్రగతికి ఉపయోగపడుతోంది. కోరుకొండ మండలం నరసాపురంలో రూ.3.50 కోట్లు, సీతానగరం మండలం చినకొండేపూడిలో రూ. 3.68 కోట్లు, కాటవరంలో రూ. 3.8 కోట్ల నిధులతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రజల విద్యుత్ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చగలుగుతాయి.

నాణ్యమైన విద్యుత్



నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ లోవోల్టేజీ సమస్య రాకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పనిచేశారు. మూడు మండలాలలో ఆరు చోట్ల ఆయా ప్రాంతాల అవసరాల మేరకు ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులు తీసుకువచ్చి, పనులు పూర్తి చేయించడం చిన్న విషయం కాదు. ముందు చూపుతో ఆయన తీసుకున్న చర్యలు నేడు ప్రజలకు ఎంతగానో మేలు చేస్తున్నాయి.

– మందారపు వీర్రాజు, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్, శ్రీకృష్ణపట్నం

నిజమైన నాయకుడు



ప్రజల అవసరాలను గుర్తించి, పనిచేసేవాడే నిజమైన నాయకుడు. అలాంటి వారిలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముందువరసలో ఉంటారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలందించారు. ఎవ్వరూ చేయనంతటి అభివృద్ధిని చేసి చూపించారు. అందులో లోవోల్టేజ్ సమస్య నివారణకు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేయడం ఒకటి.

– గంగిశెట్టి సోమేశ్వరరావు, దివాన్ చెరువు

తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష


రంగంపేట పీహెచ్‌సీలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీతో పాటు, చంద్రేడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లి పాలు దోహదపడతాయన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల పాటు కేవలం తల్లి పాలే తాగించాలన్నారు. దాదాపు రెండేళ్ల వరకు తల్లి పాలు ఇవ్వచ్చన్నారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

పిల్లలకు శ్రేష్ఠమైనవి

పెదపూడి: బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని, తల్లులు తప్పనిసరిగా బిడ్డకు పాలివ్వాలని కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీపద్మ అన్నారు. కాండ్రేగుల, శహపురం గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముర్రుపాలు ప్రాముఖ్యాన్ని వివరించారు. బాలల హక్కులు, చట్టాలపై జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు నాయకత్వ అండ

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అధికార పార్టీ దాడుల్లో బాధితులకు ఆర్థిక భరోసా చెక్కుల అందజేత


బాధితుడికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ శ్రేణులకు నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అధికార పార్టీ దాడుల్లో గాయపడిన, ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులకు వైఎస్సార్ సీపీ ఆర్థిక భరోసా చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పార్టీ అనపర్తి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులపై జరిపిన దాడుల్లో కొంతమంది మరణించడం, పలువురు గాయపడటం తెలిసిందేనన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అండగా నిలుస్తుందని, ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన దాడి ఘటనల్లో బాధితులకు ఆర్థిక సాయంగా చెక్కులను పంపించారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 17 మంది బాధితులకు రూ.50 వేల చొప్పున, నలుగురికి రూ.లక్ష చొప్పున చెక్కులను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, స్థానిక మండల, గ్రామ స్థాయి నాయకుల సమక్షంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల పార్టీ మండల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాద్‌రెడ్డి, గుత్తుల వెంకటరమణ, అనపర్తి వైస్ ఎంపీపీ బుల్లిరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ నాయకులు కె.ఇజ్రాయేలు, నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, పేపకాయల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల మీదుగా బస్సు సర్వీసు ప్రారంభం


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక అన్నారు. రాజమహేంద్రవరం కాంప్లెక్స్ నుంచి రాజానగరం మండలంలోని పలు గ్రామాల మీదుగా ద్వారపూడి వెళ్లే సర్వీసుకు శుక్రవారం ఎమ్మెల్యే పూజలు చేయగా, డీపీటీఓ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజానగరం మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలపగా తక్షణమే బస్సు సర్వీసును నడిపేందుకు అంగీకరించారన్నారు. డీపీటీఓ షర్మిల అశోక మాట్లాడుతూ ఈ బస్సు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరి హౌసింగ్ బోర్డు కాలనీ, దివాన్ చెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, పాత తుంగపాడు, కొత్త తుంగపాడు గ్రామాల మీదుగా ద్వారపూడికి వెళ్తుందన్నారు. డిపో మేనేజర్ షేక్ షబ్బం, నాయకులు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం జగన్నాథపురం, బుచ్చెంపేట, సీతానగరం మండలం ఉండేశ్వరపురం, మిర్తిపాడు మీదుగా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌కు ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే బత్తుల, ఆర్టీసీ డీపీటీఓ షర్మిళ అశోక, గోకవరం డీఎం రామన్నదొర ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


నరేంద్రపురంలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజానగరం, కోరుకొండ మండలాలలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను విజయవాడ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. నరేంద్రపురంలో నాలుగు ఎకరాలలోని ప్రగడ రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, అక్కడ పండిస్తున్న బీర, కాకర, పొట్ల, దొండ, పసుపు, కీరదోస, ఆనప, మున్నగు పలు రకాల కూరగాయల సాగును, వాటికి ఉపయోగిస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. కోతకు వచ్చిన తరువాత వాటిని రాజమహేంద్రవరంలోని గ్రేటెడ్ కమ్యూనిటీస్ కుటుంబాలకు విక్రయిస్తున్నారు. అలాగే నందరాడలో గుత్తుల సూర్యనారాయణ నిమ్మతోట, కొబ్బరి తోట, ఏటీఎం మోడల్ కూరగాయల సాగును పరిశీలించారు. ఈ సమయంలో వ్యవసాయ విద్యార్థులకు తలెత్తిన పలు అనుమానాలను రైతుల ద్వారానే నివృత్తి చేయించి, అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. కోరుకొండ మండలం నిడిగట్లలోని వేమగిరి అన్నపూర్ణ పొలంలోని మామిడి తోటలో అంతర పంటలుగా ప్రకృతి వ్యవసాయ విధానాలతో చేస్తున్న కూరగాయల సాగును కూడా సందర్శించారు. అనంతరం కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని కూడా సందర్శించారు. అక్కడి వరిసాగు క్షేత్రాలు, ఏడాది పొడవునా పండించే ఏటీఎం మోడల్ కూరగాయల సాగు గురించి కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా మేనేజర్ బి.తాతారావు, సహాయాధికారి వలీ వివరించారు.

ఏడీబీ రహదారికి మరమ్మతులు


పొక్లెయిన్ సాయంతో రహదారిపై గోతులను పూడ్చుతున్న సిబ్బంది


గోతులను పూడ్చిన తర్వాత రహదారి

- 'సాక్షి' కథనానికి అధికారుల స్పందన
- పొక్లెయిన్‌తో గోతులను మట్టితో పూడ్చుతున్న వైనం

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: చెరువులను తలపించే గోతులతో ప్రయాణికులకు పగలే చుక్కలు చూపించేలా తయారైన రాజానగరం – కాకినాడ ఏడీబీ రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఈ రహదారిపై ప్రయాణికులు, భారీ వాహనాల చోదకులు పడుతున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తూ జులైన 29న 'దారి పొడవునా భారీ గోతులు' అనే శీర్షిక 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన సంగతి విదితమే. వారు తీసుకున్న చర్యల ఫలితంగా రెండు రోజులుగా ప్రొక్లెయిన్ సాయంతో గోతులను పూడుస్తూ, తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో రూ.293 కోట్లతో ఈ రహదారిని జాతీయ రహదారి మాదిరిగా నాలుగు లేన్లతో అభివృద్ధి చేసే పనులు 2017లో చేపట్టారు. 21 కిలోమీటర్ల మేరకు పాక్షికంగా పనులు పూర్తి కాగా, మిగిలిన ఏరియాలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. వర్షాలు పడడంతో గోతులు క్రమేపీ పెద్దవై ప్రయాణికులు నరకాన్ని చూపించేలా తయారయ్యాయి.

వినురెడ్డికి భీష్మ వశిష్ట పురస్కారం

నేడు కాకినాడలో ప్రదానం




పెదపూడి: అనపర్తి గ్రామానికి చెందిన నల్లమిల్లి వినురెడ్డి ప్రతిష్ఠాత్మకమైన భీష్మ వశిష్ట పురస్కార్‌కు ఎంపికయ్యారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో నిస్వార్థ సేవలను అందిస్తున్న నేపథ్యంలో తనను హైదరాబాద్‌కు చెందిన వందేభారత్ అనే సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. శనివారం కాకినాడలో కుసుమ సత్య ఫంక్షన్ హాల్‌లో జరిగే ఎక్స్‌పోలో పురస్కారం అందజేస్తారన్నారు. గత పదేళ్లుగా సోషల్ మీడియా నుంచి ప్రజా సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార దిశగా కృషి చేస్తున్నానన్నారు. తన యూట్యూబ్ ఛానల్‌లో గోదావరి జిల్లాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యాన్ని వివరించినట్టు చెప్పారు. ప్రభుత్వం, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో ఇంటర్నేషనల్ సోషల్ మీడియా అవార్డు పొందానన్నారు. తాజాగా అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ సభ్యులు, జయహో సభ్యులు, తెలుగు భాష అభిమానుల సంఘం, సనాతన ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు తదితరులు అభినందించారు.

కోరుకొండ హైస్కూల్‌కు జాతీయ గుర్తింపు


అటల్ మారథాన్‌లో సత్తా చాటిన కోరుకొండ హైస్కూల్ విద్యార్థులు

మధురపూడి: అటల్ మారథాన్‌లో కోరుకొండ హైస్కూల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కోరుకొండ ప్రభుత్వోన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పరిశోధనలో వీరు తయారు చేసిన నమూనా పత్రానికి జాతీయ స్థాయిలో 124వ స్థానం దక్కింది. ఈ సందర్భంగా యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యునెసెఫ్) రాష్ట్ర స్థాయి కన్సల్టెంట్ టి. సుదర్శన్ స్కూలును సందర్శించి, విద్యార్థులను అభినందించారు. స్కూల్ హెచ్‌ఎం ఎంఎస్ మణికుమార్, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సత్యానంద్, సుబ్రహ్మణ్యం, రామారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్ధారణ సర్వే పూర్తి


సింగవరంలో మహిళను పరీక్షిస్తున్న లెప్రసీ పారా మెడికల్ ఆఫీసర్ వీర్రాజు

సీతానగరం: లెప్రసీ కేస్ డిటేక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలో 80,783 మందిని సర్వే చేసి, 166 మంది అనుమానితులను పరిక్షించామని జిల్లా లెప్రసీ కంట్రోల్ పారా మెడికల్ ఆఫీసర్ ఐ.వీర్రాజు తెలిపారు. సింగవరంలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మండలంలో అన్ని గ్రామాల్లో సర్వే జరిగిందన్నారు. 166 అనుమానితులను వైద్య పరీక్షలు జరపగా వీరిలో ముగ్గురికి లెప్రసీ ఉందని నిర్ధారణ అయ్యిందన్నారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ లెప్రసీ నిర్ధారణ అయిన వారికి ఇంటి వద్దే ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. ఇంటింటి సర్వే ముగిసిందని, ఎవరికి ఏ విధమైన మచ్చలున్నా ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రంగంపేట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతనూ పాటించాలని ఎంపీడీఓ పి.వెంకటరత్నం అన్నారు. శుక్రవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పంచాయతీ కార్యదర్శులకు, ఏఎన్ఎంలకు సూచించారు. దోమతెరలు వాడాలని, అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలని, రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. ఇంటి ఆవరణలో ఉన్న పూలకుండీలు, వాడని సామాన్లలో చేరిన నీటిని తొలగించాలన్నారు. పరిశుభ్రత పాటించడం వల్ల రోగాలు దరిచేరవన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు


శాకంబరి మాతగా విజయదుర్గ అమ్మవారు

పెదపూడి: ఆషాఢ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా సంపర గ్రామంలోని విజయదుర్గ అమ్మవారు శాకంబరి మాతగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, లలితా పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూజిస్తే ప్రజలకు అన్నపానీయాలకు ఇబ్బంది లేకుండా చూస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమని ఆయన తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిదేవిగా సత్తెమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు జువ్వలదొడ్డిలో ఉన్న సత్తెమ్మ తల్లి శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా, విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


శాకంబరిదేవిగా బిక్కవోలు సత్తెమ్మ తల్లి